
నేటి దినపత్రిక
17వ
# సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
సోమవారం,27 మే 2024
1

# కూటమికి బాసటగా నిలిచిన గ్రామాలు

## - మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ వ్యాఖ్య



**పెదవేగి,మేజర్ న్యూస్:** ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమికి బాసటగా నిలిచిన ప్రతి గ్రామానికి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు, దెందులూరు నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి గ్రామ కమిటీలు,స్థానిక ప్రజల సమన్వయంతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించనున్నట్టు ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ తెలిపారు.దెందులూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు నాయకులు,కార్యకర్తలు ఆదివారం ఉదయం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ప్రభాకర్‌నీ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. తమ గ్రామాల్లో జరిగిన పోలింగ్ సరళని వివరించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు మండల పార్టీ అధ్యక్షులు లావేటి శ్రీనివాస్,సహా పలువురు సీనియర్ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ...అనే నేను..!

# సర్వేల సంకటం..?

## పార్టీల్లో,అభ్యర్థుల్లో, ప్రజల్లో గందరగోళం

**ఏలూరు,సూర్యబ్యూరో :** ఓట్ల లెక్కింపు తేదీ జూన్ 4దగ్గర పడుతుండడంతో రకరకాల సర్వేలు వెలుగు చూస్తున్నాయి. ప్రతి రాజకీయ పార్టీకి, పోటీ చేసిన ప్రతి అభ్యర్థికి అనుకూలంగా కొన్ని సర్వే సంస్థలు, వ్యతిరేకంగా మరికొన్ని సర్వే సంస్థలుసోషల్ మీడియాలో పుంఖాను పుంఖాలుగా ప్రతిక్షణం ప్రచారంలో పెడుతున్నాయి. రాష్ట్రస్థాయిలో ఎన్ డి ఏ కూటమి గెలుస్తుందని రకరకాల సర్వేలు వస్తున్నాయి.సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తమ పార్టీ గతంలో కన్నా ఎక్కువ సీట్లు గెలుచుకుంటుందని స్వయంగా ప్రకటించిన నేపథ్యంలోఆనాటి నుండి వైయస్సార్సీపీకి అనుకూలంగా మరికొన్ని సర్వేలు యూట్యూబ్లో, సోషల్ మీడియాలో జిల్లాల వారీగా, నియోజకవర్గాల వారీగాసర్వేనివేదికలుఅంటూ, ఆయా సంస్థల విశ్లేషణలతో వెలువడుతున్నాయి. ఇంకా ఒక అడుగు ముందుకేసి ఫలానా అసెంబ్లీ నియోజకవర్గంలో అభ్యర్థి ఓడిపోయారు...రాష్ట్రస్థాయిలోఆపార్టీఅధినేత ఓడిపోయారు..ఆపార్టీ ఓడిపో యింది.అతితక్కువ సీట్లతోనే మనుగడసాగిస్తుంది. మా పార్టీ అధికారంలోకి వస్తుంది. అధికారంలోకి వచ్చింది... అంటూ మరికొందరు ప్రచారం చేస్తున్నారు. తమ ఎమ్మెల్యే అభ్యర్థి ఘన విజయం సాధించి వచ్చే నెల 4వ తేదీ తర్వాత..... అనే నేను అంటూ... అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేస్తారంటూ సోషల్ మీడియాలో రకరకాల పోస్టులు ప్రచారంలో పెడుతున్నారు. ఈ సర్వేల గందరగోళం తో పందెం రాయుళ్లు కూడా తికమక పడుతున్నారు. ప్రజలను ఈ సర్వేలు అయోమయానికి గురి చేస్తున్నాయి.

కొంతమంది మాత్రం ఎవరు గెలిచినామనపని,మనశ్రమ, మనకుతప్పదు అంటూ నిట్టూర్పులు విడుస్తున్నారు. కాగా ప్రతిరోజు యూట్యూబ్లో లెక్కలేనన్ని సంస్థలు సర్వే నివేదికలంటూ, తమ విశ్లేషణ గతంలో కూడా విజయవంతం అయిందంటూ, ఈసారి కూడా తాము చెప్పిందే జరుగుతుందంటూ, తమది విశ్వసనీయమైన సంస్థ అంటూ, అటు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులను, పార్టీలను, కార్యకర్తలను, నాయకులను గందరగోళానికి గురిచేస్తున్నాయి.తాము అధికారంలోకి వస్తున్నామంటూ, సర్వేలు మాకు అనుకూలంగ ఉన్నాయంటూ,మిగతావారిసంగతి తేలుస్తామంటూ మరికొందరు ఛీంకారాలు పలుకుతున్నారు. ఈ విధంగా రకరకాల సర్వేలు ప్రజలను అయోమయానికి, అప నమ్మకానికి గురి చేస్తున్నాయి. జూన్ 1వ తేదీ సాయంత్రం 7 గంటల నుండి వెలువడే ఎగ్జిట్ పోల్స్ తో ఆయా పార్టీల, అభ్యర్థుల ట్రెండ్ తెలుస్తుంది.4వ తేదీ మధ్యాహ్నానికి రాష్ట్రంలో ఏ పార్టీ విజయం సాధించేది వెల్లడి కానుంది. అప్పటివరకు కాలక్షేపానికి కబుర్లు అన్న చందంగాఈ సర్వే సంస్థల ఫలితాలు వస్తూనే ఉంటాయి.

# పారదర్శకంగా ఓట్ల లెక్కింపునకు కసరత్తు

- ఎన్నికల విధుల్లో 938 మంది సిబ్బంది
- ఎవరైనా ప్రశాంతతకు విఘాతం కలిగిస్తే చర్యలు



ఏలూరు,మేజర్ న్యూస్: జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియకు జిల్లా అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. కౌంటింగ్ ప్రక్రియను సజావుగా,పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చర్యలు తీసుకున్నారు. ఏలూరు పార్లమెంటుతో పాటు జిల్లా వ్యాప్తంగా 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈ నెల 13వ తేదీన పోలింగ్ రోజున వినియోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు ఇప్పటికే జిల్లా కేంద్రంలోని సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఉంచారు. ఇందులో భాగంగా ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుల్స్ లో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం 14 మంది వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులను అదనపు ఏఆర్వోలుగా నియమించారు. కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు దృష్టి పెట్టిన అధికారులు సుమారు 938 మందిని లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనేలా చూస్తున్నారు. 7 నియోజక వర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ తో కలిపి సుమారు 13.70 లక్షల మందికి (84.82 శాతం)పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఈ ఓట్లను లెక్కించేందుకు ఇప్పటికే వివిధ శాఖల అధికారులను ఎంపిక చేసి ఈ నెల 27వ తేదీన శిక్షణ ఇవ్వనున్నారు. ఓట్ల లెక్కింపులో 938 మందికి బాధ్యతలు అప్పగించనున్నారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు గాని టపాసులు పేల్చడం వంటివి చేయరాదని ఆదేశాలు జారీ చేశారు. అలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా కౌంటింగ్ కేంద్రాలపై డ్రోన్లు ఎగరకుండా రెడ్ జోన్‌గా ప్రకటించారు.

## స్ట్రాంగ్ రూమ్ లను తనిఖీచేసిన జెసి బి.లావణ్య వేణి



**ఏలూర్లు,మేజర్‌న్యూస్:** దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను జాయింట్ కలెక్టర్,రిటర్నింగ్ అధికారి బి.లావణ్య వేణి ఆదివారం తనిఖీచేశారు. ఏలూరు లోని సర్.సి.ఆర్. ఇంజనీరింగ్ కళాశా లలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ స్ట్రాంగ్ వద్ద భద్రతను జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతీరోజు స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతను పరిశీలించవలసి ఉందన్నారు. ఈవీఎంలకు తలుపులకు వేసిన తాళాలను,తాళాల కున్న సీళ్లను,సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సందర్శకుల రిజిష్టర్‌లో జేసీ సంతకం చేశారు.

## ఓట్ల లెక్కింపు సందర్భంగా ప్రశాంతతకు సహకరించాలి



**భీమడోలు,మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భీమడోలు సర్కిల్ పరిధి గ్రామాలలో ఏటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉంటూ తగిన చర్యలు తీసుకున్నామని భీమడోలు సిఐ బీబీ రవికుమార్ తెలిపారు. భీమడోలు సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐ వై.సుధాకర్ తో కలిసి సిఐ రవికుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదీ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో పోలీస్ యాక్ట్, 144సెక్షన్ అమలు నేపథ్యంలో ఎటువంటి ర్యాలీలకు అనుమతులు లేవని,రాజకీయ పార్టీల నేతలు విజయోత్సవ వేడుకలు పేరిట బాణాసంచా కాల్పులు నిషిద్ధం అని, బైక్స్ సైలెన్సర్ తీసి నడపటం నిషిద్ధం అని ఇప్పటికే వీటిపై ప్రజలకు, రాజకీయపక్ష నేతలకు అవగాహనా సదస్సులు నిర్వహించామనిసిఐతెలిపారు.సోషల్‌మీడియాలో అసత్యప్రచారాలను, దూషణలకు పాల్పడితే శిక్షలు కఠినంగా ఉంటాయని ,భీమడోలు,ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటికే కార్డెన్స్ సెర్చ్‌లు నిర్వహించామని,ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పెట్రోలు బంక్‌ల వద్ద బాటిల్స్‌లో పెట్రోలు పోయడం నిషేధం విధించడం జరిగిందని దీనికి ప్రతిఒక్కరు సహకరించాలని సిఐ రవికుమార్ వెల్లడించారు.

## స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతా చర్యలు పరిశీలించిన జిల్లా ఎస్పి



**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక సి.అర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈవిఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతా చర్యలను జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదివారం పరిశీలించారు. పటిష్టమైన మూడంచెల భద్రత నడుమ బ్యాలట్ బాక్స్‌ల స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు. 24గంటలు పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో బందోబస్తు విధులు,సిసి కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ. ప్రతి స్ట్రాంగ్ రూమ్, పరిసరాలలో సిసి టివి కెమెరాలతో ప్రత్యేక నిఘా స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు,సిబ్బందికి పలు సూచనలు,సలహాలు ఇచ్చారు. కౌంటింగ్ పక్రియ పూర్తయ్యేవరకు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని స్ట్రాంగ్ రూమ్‌కి నలువైపులా పోలీస్ పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతూ గార్డ్ సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు.

# ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

## - అభ్యర్థులు,ఏజెంట్లకు జిల్లా ఎన్నికల అధికారి సూచనలు



**భీమవరం,మేజర్ న్యూస్:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ 4వ తేదీన జిల్లాలో ఏర్పాటు చేసిన రెండు సెంటర్ల నందు ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఉదయం 8 గంటలకే మొదలవుతుందని జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. మొదట పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని, అనంతరం 7 నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లలో ఈవీఎంల ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. నరసాపురం పార్లమెంటు నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపుకు 10 టేబుళ్ళు ఏర్పాటుకు తొలుత అనుమతి పొందగా,పోస్టల్ బ్యాలెట్ ఓట్లు అధికంగా పోలైనందున మరో 5 టేబుల్స్ ఏర్పాటుకు ఎలక్షన్ కమిషన్ నుండి అనుమతి పొందడం జరిగిందన్నారు. మొత్తం 15 టేబుల్స్ ను పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుకు వినియోగించడం జరుగుతుందన్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ముందస్తు ఏర్పాట్లు చేసుకున్న తర్వాత వాస్తవ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఆర్వో సంతకం ఉన్న పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటు అవుతుందన్నారు. ఆర్వో సీల్ లేకున్నా తిరస్కరించవద్దన్నారు. ఫామ్-13సి పై ఆర్వో సంతకంతో పాటు అన్ని వివరాలు ఉండాలన్నారు. ఆర్వో సంతకం సహా బ్యాలెట్‌ను ధ్రువీకరించే రిజిస్టర్,కౌంటర్ ఫైల్స్‌తో సరిపోల్చుకోవాలని సూచించారు. అంతేకాకుండా గెజిటెడ్ అధికారి ధ్రువీకరించి సంతకం చేసి స్టాంపు వేయడం గాని లేదా హోదా గాని రాసి ఉండాలన్నారు. అలా ఉంటేనే అది చెల్లుబాటు అవుతుందన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఓట్ల లెక్కింపు కేంద్రానికి జూన్ నెల 4వ తేదీ ఉదయం 7.00 గంటల లోపుగా సంబంధితరిటర్నింగ్అధికారులకు రిపోర్ట్ చేయవలసి ఉంటుందన్నారు

# వాతావరణ మార్పులతో కుదేలైన ఆక్వా రంగం





## - చేపలను కేజీ 10,20 రూపాయలకు అమ్ముకున్న రైతులు

**భీమవరం,మేజర్ న్యూస్:** ఆక్వా రైతులకు వాతావరణంలో అకస్మాత్తుగా సంభవించిన మార్పు లతో ఉక్కపోత తోడవడంతో చెరువులో ఆక్సిజన్ సమస్య తలెత్తి రైతులకు తలకి మించిన భారంగా మారింది. గత 3 రోజుల నుండి వాతావరణంలో మార్పు రావడంతో చేపల చెరువులో డివో శాతం పడిపోయి చేతికి అందొచ్చిన సాగు కంటి ముందే చనిపోయి చేపలు తేలిపోవడంతో దిక్కు తోచని పరిస్థితుల్లో రైతులు అయిన కాడికి అమ్ముకోవడానికి పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు లాంచీలరేవులోని మార్కెట్లో కేజీ 10,20 రూపాయలకు ఆదివారం అమ్మారు. భారీ సైజు చేపలు సైతం మృత్యువాత పడటంతో రైతులకు భారీగా నష్టం వాటిల్లిందని భాస్కరరావు పేటకు చెందిన పది ఎకరాలు చేపల చెరువు చేస్తున్న రత్నరాజు తెలిపారు. మారిన వాతావరణ పరిస్థితిలో రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ కోసం ఏర్పాటు చేసిన ఫ్యాన్ సెట్లు తిరుగుతున్నప్పటికి ఉక్కపోత ప్రభావంతో రొయ్యలు పైకి రావడంతో ఆక్సిజన్ మందులు వాడాల్సిన పరిస్థితి తలెత్తింది. కొందరు రైతులు మందుల ఖర్చులు భరించలేక అయిన కాడికి రొయ్యలను పట్టుబడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు మరొవైపు వైట్ కట్ వైరస్ వంటి వ్యాధుల నుంచి రొయ్యలను కాపాడుకుని సాగు చేస్తున్నా చివరకు గిట్టుబాటు ధర రాకపోవడంతో ఇబ్బంది పాలు అవుతున్నారు. కొత్త ప్రభుత్వమైనా తమ సమస్యలు పరిష్కారం అవుతుందని ఆశా భావంతో ఆక్వా రైతులు ఉన్నారు.

# వేడుకగా మన్నా చర్చి వేసవి మ్యూజిక్ శిక్షణా శిబిరం





## - చిన్నారులకు పాస్టర్ ఎం.జ్యోతిరాజు చే సర్టిఫికెట్లు అందజేత

**ఏలూరు,మేజర్ న్యూస్:** దయామణి మెమోరియల్ బ్లెస్సింగ్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో వేసవి శిభిరంలో భాగంగా నెలరోజుల పాటు వివిధ సంగీత పరికరాలపై శిక్షణ పొందిన 270 మంది చిన్నారులకు ప్రముఖ అంతర్జాతీయ దైవ వర్తమానికులు పాస్టర్ ఎం.జ్యోతిరాజు సర్టిఫికెట్లు, మెమంటోలు అందజేశారు. ఆదివారం స్థానిక సి.ఎస్.ఐ మైదానంలో సర్టిఫఫికెట్స్ అందజేత కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. పాడ్స్‌లో 70 మంది,కీబోర్డులో 130 మంది,గిటార్‌లో 30 మంది, తబలలో 40 మంది మొత్తం 270 మంది శిక్షణ పొందగా,వీరంతా ఆయా విభాగాల్లో తమ ప్రతిభను చాటారు. పాస్టర్ ఎం.జ్యోతిరాజు,క్వాయర్ టీం క్రిస్తవ గీతాలను ఆలపించగా వాటికి చిన్నారులు లయ భద్ధంగా చక్కని సంగీతాన్ని వినిపించి శ్రోతలను ఊర్రూతలూగించారు. నగరానికి చెందిన అనేక మంది ప్రముఖ సంగీత దర్శకులు,గాయకులు ఇందులో పాలుపంచుకున్నారు. కార్యక్రమలో తల్లిదండ్రులు,నగర ప్రముఖులు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపు అయ్యేంతవరకు ఎన్నికల కోడ్ అమలు



**పెదవేగి, మేజర్ న్యూస్: ఓట్ల** లెక్కింపు పూర్తయ్యేవరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, ఈ సమయంలో ఎవ్వరూ గుంపులుగా ఉండకూడదని పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాస కుమార్ చెప్పారు. మండలంలోని కూచింపూడిలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కేసులు నమోదైతే అది వారిని జీవితాంతం వెంటాడుతాయన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలని, గ్రామాల్లో శాంతియుత వాతావరణానికి విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కూడళ్ళలో నలుగురికి మించి వ్యక్తులు గుమికూడి ఉండడం,అనుమతి లేకుండా సభలు,సమావేశాలు నిర్వహించడం చేయరాదని ఆయన చెప్పారు. ఓట్ల లెక్కింపు అనంతరం గెలిచిన అభ్యర్థులకు సంబంధించి టపాసులు, బాణాసంచా వేయవద్దని, అలాచేస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. ఎవ్వరికివారు సంయమనంతో వ్యవహరించి, గ్రామాల్లో శాంతియుత వాతావరణానికి సహకరించాలని, అప్పుడే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని ఆయన వివరించారు. సీఐతోపాటు పెదవేగి ఎనె బి.రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

## టౌన్ హాస్పిటల్ ఎండిని సత్కరిస్తున్న పీఎంపీలు



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** ఇటీవల నూతనంగా ప్రారంభించిన పెనుమదం రోడ్డులో గల టౌన్ హాస్పిటల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో ఆర్ఎంపి పి.ఎం.పి ప్రాక్టీషనర్ల సమావేశం జరిగింది, ఈ సందర్భంగా హాస్పిటల్ ఎండి ముత్యాల దుర్గాప్రసాద్ను ఘనంగా సత్కరించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా హాస్పటల్ రూపకల్పన చేస్తామని అన్ని అధునాతన సౌకర్యాలతో మంచి అనుభవం ఉన్న డాక్టర్లచే వైద్య పరీక్షలు ఉంటాయని తెలిపారు. డాక్టర్ ముత్యాల విజయ దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం కార్తీక్, డాక్టర్ శ్రీ లక్ష్మీ ప్రసన్న, డాక్టర్ శ్రీహర్ష ప్రసంగించారు,ఈకార్యక్రమంలోజయరాజ్, తౌడ్రాజు,మండేల అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు మానవత సహకారం



**చింతలపూడి,మేజర్ న్యూస్:** చింతలపూడి మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మాసాం తపు సమావేశం యర్రగుంటపల్లి కారుమూడి రమేష్ రెడ్డిరాధా కళ్యాణ మండపంలో మండల అధ్యక్షులు పుల్లూరి సోమశేఖరాచార్యులు అధ్యక్షతన జరిగినది. ఈనెల జరిగిన కార్యక్రమాల మీద సమీక్ష భవిష్యత్తు కార్యాచరణ గురించి రాబోయే సంవత్సరం నూతన కమిటీ గురించి చర్చ జరిగింది. అనంతరం గ్రామంలో కమ్యూనిటీ హాల్ వద్ద జరిగిన కార్యక్రమంలో పదవ తరగతి లో ఉత్తీర్ణత సాధించిన ఇద్దరు స్థానిక విద్యార్థినులకు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. తొమ్మండ్రు వాసుకి అనే విద్యార్థినికి రూ.10వేలు, నారపాం శివాని అనే విద్యార్థినికి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న కార్యక్రమాల గురించి అధ్యక్షులు పుల్లూరి సోమశేఖరా చార్యులు,ముప్పిడి శామ్యూల్,పొట్టి చక్రధర రావు,ఉమ్మడి రాజారావు విపులంగా వివరించారు.

ఈ కార్యక్రమంలో మానవతకన్వీనర్‌కాండ్రేగులనాగ చిన్నారావు, కార్యదర్శి ఎ.రాజారావు, జి.శ్రీనివాస రెడ్డి, కె.ఏడుకొండలు, పి.మన్మథ రావు, వై.శ్రీనివాసరావు,టి.చిట్టిగోవర్ధన రావు,పి.ప్రసాద్, ఆర్.మధు మాష్టారు,ఇ.నాగబాబు, జి.మహేష్, పి. పురుషోత్తం కె.సుధీర్, జె.ప్రసాద రెడ్డి కమిటీ సభ్యులు డాక్టర్ సురేంద్ర, సత్యేంద్ర కుమార్, బి.వి.ఎస్.ఎన్. రాజు,మానవతా సభ్యులు పాల్గొన్నారు.

## భీమడోలు హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**భీమడోలు,మేజర్ న్యూస్** : భీమడోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తమ విద్యనభ్యసించిన 1986-90 సంవత్సర పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. ఆదివారం భీమడోలు హైస్కూల్ ఆవరణలో 34సంవత్సరాల తరువాత కలిసిన పూర్వవిద్యార్థులు ఆటపాటలతో గడిపారు. నాటి మధురస్మృతులు నెమరువేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులతో తమకున్న అనుబంధాన్ని గుర్తుకుతెచ్చుకున్నారు. అనంతరం గ్రూప్ ఫోటోలు దిగారు. పాఠశాల ఆవరణలో కలియతిరిగి నాటి గుర్తులను తలుచుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 34ఏళ్ల అనంతరం తామంతా ఒక్కచోట కలుసుకోవడం చాలా సంతోషనిచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆహ్వానకమిటీ సభ్యులు గెడా ప్రసాద్, రంకిరెడ్డి శేఖర్, గంధం సురేష్, కరణం మోహన శ్రీనివాస్, ఆరవల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జంగారెడ్డిగూడెంలో కార్డాన్ సెర్చ్ : 14 మోటార్ సైకిళ్లు స్వాధీనం



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** జిల్లా ఎస్పీ డి మేరీ ప్రశాంతి, జంగారెడ్డిగూడెం డిఎస్పి యు రవిచంద్ర రెడ్డి ఆదేశాలపై సిఐపి రాజేష్,ఎస్సై జ్యోతి బాసు,లక్కవరం సుధీర్ బాబు,ట్రాఫిక్ ఎస్ఐ పోలీసు సిబ్బంది స్థానిక వైయస్సార్ కాలనీలో కార్డెన్ సెర్చ్ ను నిర్వహించి 14 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు.ఆ ప్రాంతంలో అనుమానాస్పదమైనటువంటి వ్యక్తుల కదలికలను గురించి,ఏ విధమైన రికార్డు లేని వాహనాలను స్వాధీనం చేసుకొని ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలన చేశారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా కార్డాన్ సెర్చ్ నిర్వహించి గ్రామస్తులకు సీఐ రాజేష్ అవగాహన కల్పించారు.

# పోలింగ్ నిర్వహణలో ఎలక్షన్ కమిషన్ వైఫల్యం

### - పల్నాడు,కృష్ణా జిల్లా కలెక్టర్లను తిరిగి కొనసాగించాలి

**ఏలూరు,మేజర్ న్యూస్:** పోలింగ్ నిర్వహణలో ఎలక్షన్ కమిషన్ పూర్తిగా వైఫల్యం చెందిందని, ఎస్సీ,ఎస్టీ,బీసీ ఐఏఎస్ అధికారులను ఉద్దేశపూర్వకంగా బదిలీలు చేసి సస్పెండ్ చేశారని, ఆంధ్ర ప్రదేశ్‌లో ఎన్నికల అనంతరం జరిన హింసను అడ్డుకోవడంలో నిఘా వ్యవస్థ పూర్తిగా విఫలం అయిందని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు అన్నారు. ఎన్నికల అనంతరం జరిగిన హింసలో ఎన్నికల కమీషన్ ఎటువంటి దర్యాప్తు చెయించకుండా కేవలం ఛీఫ్ సెక్రటరీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఐఏఎస్‌లపై చర్యలు తీసుకోవడాన్ని




తమ దళిత జేఏసీ వ్యతిరేకిస్తుంది అని ఎలక్షన్ కమీషన్ సిఈఓ ముఖేష్ కుమార్ మీనాను పెరికె వరప్రసాదరావు కోరారు. చర్యలు తీసుకున్న ఐఎఎస్,ఐపిఎస్ లకు తిరిగి పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. పల్నాడు, చంద్రగిరి, తాడిపత్రి ప్రాంతాల్లో జరిగే హింస గురించి మీకు ముందు అవగాహన లేదా గతంలో జరిగిన అంశాలను మీరు పరిశీలించ లేదా అని ఎన్నికల కమీషన్,సిఎస్ లను ప్రశ్నించారు. పల్నాడు జిల్లా కలెక్టర్‌గా శివశంకర్‌ను, కృష్ణాజిల్లా కలెక్టర్ రాజబాబును తిరిగి కొనసాగించాలని డిమాండ్ చేశారు.

## ప్రముఖ దేవస్థానాలలో అన్న సమారాధన



**భీమడోలు,మేజర్ న్యూస్** : మండలంలోని రెండు వేరువేరు గ్రామాల్లో గల ప్రముఖ దేవస్థానాలలో ఆదివారం అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఫైర్ స్టేషన్ వద్ద గల సాయిబాబా దేవాలయం వద్ద దేవాలయ 37వ వార్షికోత్సవం సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం ,ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. గుండుగొలను వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద స్వామివారి కళ్యాణ మహోత్సవాల పురస్కరించుకొని అన్న సమారాధన కార్యక్రమాన్ని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి అన్న ప్రసాద వితరణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలాదిగా ప్రజలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## మానవత నూతన కార్యవర్గం




**పాలకొల్లు,మేజర్ న్యూస్:** మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పాలకొల్లు మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నెలవారీ కార్యక్రమంలో భాగంగా స్థానిక రోటరీ భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షుడిగా ఉల్లంపర్రు మాంటిసోరి స్కూలు అధినేత మద్దాల వాసు,కార్యదర్శిగా విజయ ల్యాబ్స్ అధినేత కొమ్ముల మురళి, కోశాధికారిగా ముత్యాల శ్రీవాత్సవా ప్రదీప్ ఎన్నికయ్యారు. వీరి పదవీకాలం ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది జూన్ 30వ తేదీ వరకు ఉంటుందని, తెలిపారు, మానవత మండల శాఖ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన కార్యవర్గాన్ని అభినందించారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం వచ్చేనెల 23వ తేదీన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ముత్యాల రామారావు, సహాయ కార్యదర్శి గోపి,సభ్యులు బొక్క గంగాధర్, చిలుకూరి భీమన్న, షెక్ పీర్ సాహెబ్, సొమంచి శాస్త్రి, యం అర్ కే రాజు, వారధి వెంకట రమణ, అత్యం ఆదిశేషారావు,బోల్ల శ్రీనివాస్, పనింద్రుడు,తమ్మినీడి మురళీ, బోల్ల వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఉమ్మడి ప.గో. జిల్లా గ్రంథాలయ సంస్థ, ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయం లో వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం ఉత్సాహంగా సాగుతున్నాయి. వివిధ పాఠశాలల విద్యార్థిని,విద్యార్థులు క్రమం తప్పకుండా శిక్షణా శిబిరం నకు హాజరవుతున్నారు. ఆదివారం 8 గంటల నుండి 11:30 గంటల వరకు రిసోర్స్ పర్సన్‌లు డి శ్రీవల్లి,జి.కళ్యాణి,ప్రముఖ హేలాపూరి చిల్డ్రన్స్ క్లబ్ సెక్రటరీ పి.దుర్గా ప్రసాద్ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మైండ్ మెమరీ పవర్ గేమ్స్, మంచి మంచి నీతి కథలు చదివిస్తూ, విద్యార్థుల చేత కథల్లోని నీతిను చెప్పించారు. సరదా గేమ్స్, బెలూన్,డిస్పోజల్ గ్లాస్లులతో రిసోర్స్ పర్సన్‌లు వెరైటీ గేమ్స్ ఆడించారు. ఈ వేసవి శిబిరం (సమ్మర్ క్యాంప్) అనంతరం మీరందరూ తరచూ మీ ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాలకు వచ్చి మంచి విజ్ఞానంను నేర్చుకోవాలని,ఈ 'వేసవి విజ్ఞాన శిబిరాలు' ప్రత్యేకంగామీ గురించే పెట్టారని,అంటూ విద్యార్థులకు 'రిసోర్స్ పర్సన్స్'వివరించడం జరిగింది.ఈ శిక్షణా శిబిరం కార్యక్రమాలను డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణ రావు పర్యవేక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది వి.టి సందీప్ కుమార్, ఎండీ.ఎ.అస్లాం పాషా,ఎం.కనకదుర్గ, విద్యార్థులు ఉత్సాహంగా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలవరంలో కార్డన్ సెర్చ్ నిర్వహించిన పోలీసులు



**పోలవరం,మేజర్ న్యూస్:** జూన్ 4వ తేదీన జరిగే కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు ముందు జాగ్రత్త చర్యగా జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు స్థానిక సీఐ మధు బాబు ఆధ్వర్యంలో పోలవరం పంచాయతీ కమ్మర గూడెంలో కార్డన్ సెర్చ్ నిర్వహించామని ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. అనుమానం ఉన్న ప్రాంతాల్లో, రహదారిపై వాహనాలను సోదాలు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. సందేహం ఉన్న వారి పైన నిఘా పెట్టమని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కప్పులు కడిగి టీలు అందిస్తూ పెరిగా...



**మీర్జాపూర్,మేజర్ న్యూస్** : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి తన బాల్యాన్ని గుర్తు చేసుకున్నాం ు. చిన్నతనంలో తాను కప్ ప్లేట్లు కడుగుతూ, టీలు అందిస్తూ పెరిగానని చెప్పారు. మోదీకీ, టీకి మధ్య చాలా లోతైన సంబంధం ఉందన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో ఆదివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మాట్లాడుతూ, సమాజ్‌వాదీ పార్టీకి ఓటు వేసి దానిని వృథా చేసుకోవద్దన్నారు. సుస్థిరమైన ప్రభుత్వానికే ఓటు వేయాలని పిలుపునిచ్చారు.'ఇండియా' కూటమి నేతల గురించి అందరికీ తెలుసునని, వారు మతతత్వ, కులతత్వవాదులని ప్రధాని విమర్శలు గుప్పించారు. ఎప్పుడు వాళ్ల ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కులం ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటారని అన్నారు. యాదవకులంలో ఎందరో పేరున్న వ్యక్తులున్నప్పటికీ తమ కుటుంబ సభ్యులకే అఖిలేష్ టిక్కెట్లు ఇస్తుంటారని ఎద్దేవా చేశారు. "సమాజ్‌వాదీ నేతలు పట్టుబడిన టెర్రరిస్టులను కూడా విడిచిపెట్టేస్తారు. విభేదించిన పోలీస్ అధికారులను సస్పెండ్ చేస్తుంటారు. ఉత్తరప్రదేశ్, పూర్వాంచల్‌ను మాఫియాకు స్వర్గధామం చేస్తుంటారు. సమాజ్‌వాదీ ప్రభుత్వంలో లైఫ్ కావచ్చు, ల్యాండ్ కావచ్చు.. ఎప్పుడు లాగేసుకుంటారో ఎవరికీ తెలియదు. మాఫియాను ఓటు బ్యాంకుగా వారు చూస్తుంటారు" అని మోదీ విమర్శలు గుప్పించారు. పవిత్రమైన రాజ్యాంగాన్ని కూడా 'ఇండి' కూటమి ఇప్పుడు తమ లక్ష్యంగా చేసుకుందని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల నుంచి రిజర్వేషన్లను ఊడలాక్కోవాలనుకుంటోందని అన్నారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఉండరాదని రాజ్యాంగం స్పష్టంగా చెబుతోందన్నారు. పోలీస్, పీఏసీలో కూడా ముస్లింలకు 15 శాతం రిజర్వేషన్ ఇస్తామని సమాజ్‌వాదీ పార్టీ ప్రకటించిందని, వారి ఓటు బ్యాంకు కోసమే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను ఊడలాక్కోవాలని అనుకుంటోందని చెప్పారు. పేదలు, దళితులు, వెనుకబడిన తరగతుల వారి కోసం తాము అంకితభావంతో పనిచేస్తామని మోదీ భరోసా ఇచ్చారు.

# లయన్స్ సేవలు విస్తరింప చేయాలి



**ఏలూరు,మేజర్ న్యూస్:** 2024-2025 లయన్స్ సంవత్సరపు క్లబ్ అధ్యక్ష,కార్యదర్శి,కోశాధికారి క్లబ్ ఆఫీసర్ల శిక్షణా శిబిరం ఏలూరు గ్రీన్ సిటీలో గల లయన్స్ భవనం నందు లయన్స్ జిల్లా 316 జి గ్లోబల్ లీడర్షిప్ ట్రైనింగ్ అధినాయకులు నందుల సీతారామారావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా లయన్స్ సంస్థ పితామహుడు మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాలవేసి జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ యార్లగడ్డ జగన్మోహన్ రావు మాట్లాడుతూ వచ్చే సంవత్సరం లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు జులై నెల నుండి కాబోయే క్లబ్ నాయకులైన క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు,కోశాధికారి, అడ్మినిస్ట్రేటర్లకు శిక్షణా కార్యక్రమంను ఏర్పాటు చేసి లయన్స్ నాయకులలో ఉత్తమ సేవ లందించాలన్నారు. విశిష్ట అతిథి,మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ ,శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ లయన్స్ సేవలను ప్రతి పల్లెటూరికి,ప్రతి సామాన్యుడికి చేరేలా విస్తరింపజేయాలని అందుకు కావలసిన ఏర్పాట్లకు లయన్స్ సేవా కో-ఆర్డినేటర్లు సహకరించి సేవలందించాలన్నారు. 2024-25 జిల్లా గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టే కాకరాల వేణుబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఒక్కొక్క మెట్టు పైకి ఎదుగుతూ లయన్స్ సేవలు ప్రజలకు చేరువ చేస్తున్న లయన్స్ కంటి ఆసుపత్రులు,కిడ్నీ డయాలసిస్ సెంటర్లు పర్మనెంట్ ప్రాజెక్టులుగా పిలవబడే వివిధ రకాల సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా మనందరం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా ప్రథమ వైస్ గవర్నర్ పాపారావు నాయుడు, ఫ్యాకల్టీ పూర్వపు జిల్లా గవర్నర్లు డాక్టర్ పి.విజయభాస్కరరెడ్డి,వి. మురళీమోహనరావు,జిల్లా నాయకులు ఎం.శ్రీహరి,వి.రామారావు,వి.సత్యస్వరూప్,ఎల్ వెంకటేశ్వరరావు,వి.వి .స్వామి, మొదలైన వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ వ్యాఖ్యాతగా పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ వి కే పంకజాక్షన్ వ్యవహరించారు. రీజియన్ చైర్ పర్సన్ ఎం కృష్ణమోహన్, వి రత్నకుమార్ కార్యక్రమానికి ఆతిథ్యాన్ని అందించారు.

## శ్రీశ్రీశ్రీ వసంతాలమ్మ అమ్మవారికి డీపీఓ దంపతుల పూజలు



**ఏలూరురామచంద్రపురం,మేజర్ న్యూస్:** ముచ్చుమిల్లిలో కొలువైన శ్రీశ్రీశ్రీ వసంతాలమ్మ అమ్మవారికి ఏలూరు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీవాస విశ్వనాథ్, శైలజ దంపతులు విశేష పూజలు చేసారు. భక్తులకు కొంగుబంగారంగా పిలవబడుతు కోరిన కోరికలు తీర్చే దేవతగా అమ్మవారు దర్శనం ఇస్తుంటారని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ కారణంతో అనేక మంది భక్తులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వసంతలమ్మా అమ్మవారి మొక్కులు తీర్చుకోవడం అనవయితీ. సందర్భంగా డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ శైలజ దంపతులు అమ్మవారికి గరగలతో మొక్కు తీర్చుకున్నారు. సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ సతీమణి శైలజ పూర్వికులు ముచ్చిముల్లి ప్రాంతానికి చెందినవారని, ఉద్యోగరీత్యా జిల్లాకి దూరంగా ఉన్నా అనేక మంది బంధువులు రామచంద్రపురం పరిసర ప్రాంతాలలో ఉండడం వలన పండగలకు, కుటుంబ కార్యక్రమాలకు రావడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు డీపీఓ దంపతులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి సత్కరించారు.

# పాఠశాలల్లో నో బ్యాగ్ డే..

### ప్రతి నెలా మూడో శనివారం అమలు
### అన్ని తరగతులకు డిజిటల్ బోధన
### 9 గంటలకే ప్రారంభం కానున్న బడులు
### కొత్త విద్యా ఏడాదిలో 229 పనిదినాలు
### ఈసారి 20 రోజుల ముందే క్యాలెండర్
### ఏడో తరగతి గణితం బోధనపై స్పష్టత
### పాఠశాల విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్



**హైదరాబాద్,మేజర్ న్యూస్** : విద్యా సంవత్సరం ప్రారంభమైందంటే స్కూల్ బ్యాగ్స్‌పై చర్చ పెద్దఎత్తున జరుగుతుంది. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థుల బరువు కంటే వారి పుస్తకాల బరువు ఎక్కువగా ఉంటోందన్న విమర్శలు ఉన్నాయి. దీంతో చిన్నారులకు వెన్నెముక సమస్యలు వస్తున్నాయని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానం అమలు చేయనుంది. నెలకో రోజు 'నో బ్యాగ్ డే'గా ప్రకటించింది. ప్రతి నెలా మూడో శనివారం విద్యార్థులు పాఠశాలకు పుస్తకాలు లేకుండా రావాల్సి ఉంటుంది. ఆ రోజు విద్యార్థుల బోధనకు సంబంధించి ఎస్సీఈఆర్టీ ప్రత్యేక ప్రణాళిక ప్రకటించనుంది.ఈ విధానం కొత్త విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి రానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు దీనిని తప్పనిసరిగా పాటించాలి. కొత్త విద్యా సంవత్సరం వచ్చే నెల 12 నుంచి ప్రారంభమై 2025 ఏప్రిల్ 23న ముగుస్తుంది. దీనికి సంబంధించిన అకడమిక్ క్యాలెండరును పాఠశాల విద్యా శాఖ శనివారం విడుదల చేసింది. ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ), సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ) పరీక్షలతో పాటు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించే తేదీలు ప్రకటించింది. మార్చి 2025లో పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహిస్తారు. మొత్తం సంవత్సరంలో 229 పనిదినాలు ఉన్నాయి. అన్ని తరగతులకు సాఫ్ట్‌నెట్ ద్వారా డిజిటల్ తరగతుల బోధన తప్పనిసరి చేశారు. ప్రతీ రోజు 20-25 నిమిషాల పాటు ఈ ప్రసారాలు ఉంటాయి. ప్రసారాలకు ముందు ఉపాధ్యాయులు 5 నిమిషాల పాటు ఆ రోజు తరగతికి సంబంధించి విద్యార్థులకు వివరించాలి. పాఠ్యాంశాలపై విద్యార్థులకు లోతైన అవగాహనకు ఈ విధానం దోహదపడుతుందని ప్రభుత్వం పేర్కొంది. నైతిక విలువలు, లైఫ్ స్కిల్స్‌పై ప్రత్యేకంగా తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతీ రోజు ప్రార్థన సమయంలో 5 నిమిషాలు యోగా/ధ్యానం కోసం కేటాయించారు.

**ఏడో తరగతి గణితంపై స్పష్టత**

6,7 తరగతులకు గణితం ఎవరు బోధించాలన్న విషయంపై గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో వివాదం నెలకొంది. మ్యాథ్స్ టీచర్, సైన్స్ టీచర్‌లో ఈ బాధ్యతను ఎవరు నిర్వర్తించాలన్న విషయంపై స్పష్టత లేకపోవడంతో అనేక పాఠశాలల్లో విద్యార్థులు గణిత బోధనకు దూరమయ్యేవారు. ఈ అంశంపై ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఈ అకడమిక్ క్యాలెండరులో ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. 6, 7 తరగతుల గణిత శాస్త్రాన్ని ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ బోధించాలని విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం ఉత్తర్వులు జారీచేశారు.

**20 రోజుల ముందే క్యాలెండర్**

అకడమిక్ క్యాలెండరును ప్రతీ ఏటా విద్యాసంవత్సరం ప్రారంభానికి ఒక రోజు ముందు ప్రకటిస్తుండగా ఈసారి 20 రోజుల ముందు ప్రకటించడంపై విద్యా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ప్రభుత్వ నిర్ణయంతో విద్యా ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసేందుకు సమయం లభిస్తుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కే జంగయ్య, చావ రవి పేర్కొన్నారు. 9 గంటలకే పాఠశాలలు

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల వేళలు గతంలో ఉదయం 9.30 నుంచి ఉండగా దీనిని 9 గంటలకు మార్చారు. ప్రాథమిక పాఠశాలల (1-5 తరగతులు) ఉదయం 9 నుంచి 4, హైదరాబాద్, సికింద్రాబాద్‌లో ఉదయం 8.45 నుంచి మధ్యాహ్నం 3.45 వరకు ఉంటాయి. ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9 నుంచి 4.15 వరకు, ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 వరకు పనిచేస్తాయి. ఇవి రెండూ జంట నగరాల్లో ఉదయం 8.45 నుంచి 4 గంటల వరకు ఉంటాయి.

## అమ్మ ఆశీస్సులు అందరికీ ఉండాలి

### - కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి



**పెంటపాడు,మేజర్‌న్యూస్:**గోగులమ్మతల్లిఅమ్మవారి ఆశీస్సులు అందరికీ మెండుగా అందాలనికూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పెంటపాడు మండలం రాచర్లలో 20 సంవత్సరాలకు ఒకసారి వచ్చే గోగులమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఆదివారం ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన అంతమయిందని ఇక అంతా ప్రజలందరికీ శుభాలు కలుగుతాయని పేర్కొన్నారు. అమ్మవారి చల్లని ఆశీస్సులతో తనను ఈ ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యేందుకు అవకాశం ఇచ్చిన ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. పెంటపాడు జనసేన మండలాధ్యక్షుడు పుల్ల బాబి,జన సైనికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈకార్యక్రమంలోఆయన వెంటటిడిపి, జనసేన, బిజెపినాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు యడవల్లి కేద్రం పరిధిలో విద్యుత్‌కు అంతరాయం

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** 27వ తేదీ సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 33/11కెవి తాడిచర్ల కొత్త విద్యుత్ ఉపకేంద్రంనకు 33 కెవి లైన్ వేయుటకు 33/11 కేవీ యడవల్లి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11 కె.వి తాడిచెర్ల ఫీడర్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ పి.రాధాకృష్ణ తెలిపారు. వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ వేళల్లో మార్పులు ఉంటాయని ప్రజలు సహకరించవలసిందిగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోరారు.

## బాబోయ్.. తీరానికి తుపాన్ వచ్చేస్తోంది..!




**బంగ్లాదేశ్,మేజర్‌న్యూస్** : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఇవాళ ఉదయం తీవ్ర తుపాన్‌గా మారినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉత్తర దిశగా కదులుతూ.. బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ వద్ద రెమల్ తుపాన్ ఈరోజు రాత్రి తీరం దాటే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు గరిష్ఠంగా 100నుంచి 135కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వెల్లడించారు. దీని ప్రభావం పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాలపై ఉంటుందన్నారు. హెచ్చరికలు జారీ..మత్స్యకారులు ఎవరూ సముద్రంలో వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇవాళ రేపు మత్స్యకారులు సముద్ర తీరానికి వెళ్లొద్దని, ముఖ్యంగా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెమల్ తుపాన్ ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై అంతగా ఉండదన్నారు. ఉత్తరాంధ్రలో ఒకటి రెండు చోట్ల చెదురుమదురుగా వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. రేపట్నుంచి రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు.

ఒడిశా, పశ్చిమబెంగాల్ తీర ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. కోస్ట్‌గార్డ్‌ను సైతం అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హౌరా, హుగ్లీ, తూర్పు, మిడ్నాపూర్, కోల్‌కతాలో గంటకు 70-80కి.మీ. వేగంతో గాలులు వీచనున్నట్లు తెలిపారు. తీర ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు.